www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 14 మార్చి 2023
5
తిరుపతి

తిరుపతి జిల్లా పోలింగ్ సరళి (సాయంత్రం 4 గంటల వరకు)

(క్యూలో నిల్చున్నవారి వివరాలు రావాల్సి ఉంది)

పట్టభద్రుల పోలైన ఓట్లు : 55,261 మొత్తం ఓటర్లు : 86,941 పోలింగ్ శాతం : 63.56శాతం
ఉపాధ్యాయ పోలైన ఓట్లు: 5062 మొత్తం ఓటర్లు : 6133 పోలింగ్ శాతం : 82.54శాతం

15న రీపోలింగ్

229, 233 పట్టభద్రుల పోలింగ్ కేంద్రాల్లో కేసుల నమోదు కారణంగా ఓట్ల వివరాలను చూపలేదని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే తిరుపతి నగరంలో ప్రిసైడింగ్ అధికారులు 229 (ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, చిన్నబజారు వీధి), 233 (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సత్యనారాయణ పురం) పోలింగ్ కేంద్రాలలో రిగ్గింగ్ జరిగిందనీ, పోలింగ్ ప్రక్రియ ఆపి కేసులు నమోదు చేయడంతో ఎన్నికల కమిషన్ కు నివేదిక సమర్పించామని తెలిపారు. 15న రీపోలింగ్ జరపనున్నట్లు వెల్లడించారు.

తిరుపతిలో 'అధికార' దౌర్జన్యం
దొంగోట్ల పర్వం!

- పది , ఆరు చదివినవారూ 'పట్టభద్రులే'
- 'ఎంఎల్ఎ' కనుసన్నల్లో భారీగా..
- టిడిపి నేతల అరెస్టు, శ్రీకాళహస్తిలో లాఠీఛార్జి
- 229, 233లో రిగ్గింగ్‌తో ఆగిన పోలింగ్
- తిరుపతిలో రీ పోలింగ్ జరపాలి : వామపక్షాలు

ఓటు వేసేందుకు బారులు తీరిన ఆటోడ్రైవర్లు

ప్రజాశక్తి-తిరుపతి బ్యూరో, తిరుపతి టౌన్

'ఫేక్' సర్టిఫికేట్లతో ఎంఎల్‌సి పట్టభద్రుల ఓటర్లను చేర్పించడమే కాదు.. దొంగ ఓట్లను వేయించడంలోనూ అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ అంతేస్థాయిలో దాడులు, దౌర్జన్యాలకు పూనుకుంది.. సోమవారం పోలింగ్ ప్రారంభమైనప్పటి నుంచి పూర్తయ్యేవరకూ స్వయంగా ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి కనుసన్నల్లో ఏజెంట్లపై, ఎన్నికల సిబ్బందిపై దాడులకు ఉపక్రమించి మరీ దొంగ ఓట్లు వేయించుకున్నారు. రిగ్గింగ్‌కు పాల్పడ్డారు. పదో తరగతి, ఆరో తరగతే చదివామని అక్షరాలా ఓటు వేయడానికి వచ్చిన మహిళలు అమాయకంగా చెప్పి మీడియాకు దొరికిపోవడం గమనార్హం. తమ వాలంటీర్లు తమకు స్లిప్పులు ఇచ్చారని, తమ ప్రాంతంలో ముగ్గురుని సెలక్ట్ చేశామని చెప్పారని, వచ్చి ఓటేయాలని చెప్పడం వల్లే వచ్చామని 'మీడియా'కు తెలపడం దొంగ ఓటర్లను ఏ విధంగా వైసిపి తీసుకొచ్చిందో అర్థమయ్యింది. పోలీసు, అధికార యంత్రాంగం బహిరంగంగానే అధికార పార్టీకి కొమ్ముగాసింది. వైసిపి నాయకత్వాన్ని లోపలికి పంపి, టిడిపి, సిపిఎం, సిపిఐ నేతలను బయట నుంచే తరిమికొడుతూ 'దొంగ ఓట్ల'ను వేయించడంలో పోలీసులు తమ 'స్వామి'భక్తి చాటుకున్నారన్న విమర్శలూ లేకపోలేదు. గత ఎంపి ఎన్నికల్లోనూ, తిరుపతి కోఆపరేటివ్ ఎన్నికల్లోనూ ఏ విధంగా వైసిపి దౌర్జన్యంతో రిగ్గింగ్ చేసి గెలిచిందో అంతే స్థాయిలో పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లోనూ మరోసారి ఓటర్లను భయభ్రాంతులకు గురిచేశారు. వామపక్షాలు, టిడిపి, బిజెపి, జనసేన పార్టీలు గొంతు చించుకుని అరిచినా, ధర్నాలు చేసినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించారు.

రాళ్లు విసురుకున్న టిడిపి, వైసిపి శ్రేణులను చెదర గొడుతున్న పోలీసులు

ఎంఎల్ఎ కరుణాకర్‌రెడ్డి 30 దొంగ ఓట్లు వేయించారు
నారాయణగౌడ్, టిడిపి ఏజెంట్, 224 బూత్

ఎంఎల్‌సి ఎన్నికల సందర్భంగా 224 మహిళా వర్సిటీలో బూత్‌ఏజెంట్‌గా ఉన్నాను. వైకాపా నాయకులు దొంగ ఓటర్లను తీసుకొచ్చారు. అడ్డుకున్నందుకు పోలీసులను బయటకు పంపి నాపై దాడి చేశారు. పోలీసు స్టేషన్‌కు వెళుతు ఉంటే మధ్యలో అటకాయించి మారణాయుధాలతో దాడులు చేశారు. దొంగ ఓట్ల కోసం మనుష్యులను చంపే పరిస్థితిని వైసిపి నాయకులు తీసుకొచ్చారు. రాడ్‌లు, కర్రలుతో విచక్షణారహితంగా దాడి చేశారు. ఎంఎల్ఎ భూమన కరుణాకర్ స్వయంగా వచ్చి మీరు తగ్గుతారా లేదా అని వెనకంటి తీసుకొచ్చి 30 ఓట్లు దొంగ ఓట్లు స్వయంగా వేయించారు.

10 ఫెయిల్ అయ్యి ఓటు వేయడానికి వచ్చిన మహిళ

సుగుణమ్మ రాకతో వైసిపి ఆందోళన

సంజయ్‌గాంధీ కాలనీ పోలింగ్ బూత్ వద్ద టిడిపి మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మ ఓటింగ్ సరళి పరిశీలించడానికి వచ్చారు. దీంతో వైసిపి టౌన్‌బ్యాంకు ఛైర్మన్ కేతం జయచంద్రరెడ్డి, కార్పొరేటర్లు అమర్‌నాథ్‌రెడ్డి, మునిరామిరెడ్డి, కోఆప్షన్ సభ్యురాలు శ్రీదేవి, నాయకురాలు శాంతి నినాదాలు చేశారు. టిడిపి వాళ్లు పోలింగ్ బూత్‌ల వద్ద వచ్చి దొంగ ఓట్లు వేస్తున్నారని, ఆందోళనకు దిగారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతవరణం నెలకొంది. దీంతో పోలీసులు జ్యోకం చేసుకోవడంతో ఇరువురుని అక్కడనుంచి పంపివేశారు. టిడిపి మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మ మాట్లాడుతూ వైసిపి వారు పోలింగ్ బూత్‌ల్లో ఉంటే పోలీసులు పట్టించుకోవడం లేదని, స్వయంగా దగ్గరుండి దొంగ ఓట్లు వేయిస్తూ, తిరిగి తమపైనే ఎదురు ఆందోళన చేయడాన్ని ఆమె ప్రశ్నించారు.

టిడిపి నేతలు అరెస్టు

ఎంఎల్‌సి ఎన్నికల్లో దొంగ ఓట్లను అడ్డుకుంటున్నారన్న కారణంగా టిడిపి నేతలను సోమవారం అరెస్టు చేశారు. ఎస్‌జిఎస్ డిగ్రీకళాశాల వద్ద టిడిపి కార్పొరేటర్ ఆర్ మునికృష్ణను, టౌనబ్యాంకు మాజీ ఛైర్మెన్ పులిగోరుమురళి కృష్ణారెడ్డిని, నాయకులు ఊక విజయ్‌కుమార్, మబ్బుదేవనారాయణరెడ్డి, జేబి శ్రీనివాస్‌తో పాటు ఇతరులను అరెస్టు చేసి ఏర్పేడు పోలీసు స్టేషన్ తరలించారు. పోలింగ్ పూర్తియిన తరువాత సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

రాళ్లు విసురుకున్న టిడిపి, వైసిపి శ్రేణులు

తిరుపతి సిటీ : మాల్వాజి వీధిలో ఉన్న మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ పోలింగ్ బూత్ నెంబర్ 232, 232 ఏ వద్ద వైసిపి అక్రమాలను అడ్డుకున్నందుకు టిడిపి వైసిపి కార్యకర్తలు మధ్య వాదోపవాదాలు జరిగి గొడవకు దారితీసింది. మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో కొంతమంది వైసిపి కార్యకర్తలు సుమారు పదిమందికి పైగా నకిలీ మహిళా ఓటర్లను అడ్డుకున్నారు. వాదోపవాదాలతో చిలికి చిలికి గాలివానగా మారి రాళ్లు రువ్వుకున్నారు. ఈ ఘటనలో పలువురు టిడిపి కార్యకర్తలకు గాయాలయ్యాయి. అప్రమత్తమైన పోలీసులు వెంటనే అక్కడకు చేరుకొని వారిని చెదరగొట్టడంతో గొడవ సద్దుమణిగింది. ఈ ఘటనలో టిడిపి కార్యకర్తలు వంశీ, ఆర్ బాబు. శేషు, మంజునాథ్, లీలా, కల్పనా, జయంతి, రేఖ, గోవిందా చారి తదితరులకు గాయాలయ్యాయి. గోవిందా చారి పరిస్థితి విషమంగా ఉండటముతో మెరుగైన చికిత్స కోసం ఆయనను రుయాకు తరలించారు. పోలీసుల ఎదుట జరిగిన ఈ ఘటనపై పోలీసులు ఎలాంటి కేసూ నమోదు చేయకపోవడం గమనార్హం.

దొంగోటు వేయడానికి వచ్చి పట్టుబడటంతో వెనుదిరిగిన మహిళలు

దొంగ ఓటర్ల అమాయకత్వం

సోమవారం ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభం నుంచే వైసిపి పక్కా ప్లాన్‌తో పకడ్బందీగా దొంగ ఓట్లు వేసుకునేందుకు తెరదీసింది. సంజయ్‌గాంధీ కాలనీలో భారీఎత్తున దొంగ ఓట్లు వేయించారు. ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి పోలింగ్ కేంద్రాల వద్ద భారీ సంఖ్యలో అనుచరులతో తిరుగుతూ దొంగ ఓటర్లను పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించి మరీ ఓటు వేయించారు. వాలంటీర్లు, వార్డు అడ్మిన్లు భారీగా వార్డుల నుంచి తరలించారు. సంజయ్‌గాంధీ కాలనీ వద్ద ఓ మహిళా ఓటర్ క్యూలైన్‌లో నిలబడగా మీడియాకు అనుమానం వచ్చి ఎంతవరకు చదువుకున్నారు అని అడగడంతో తాను ఆరో తరగతి చదువుకున్నానని, వాలంటీర్లు పంపారని చెప్పి అక్కడనుంచి తప్పించుకుని పరారయ్యింది. మంచినీళ్లగుంట, ఐఎస్ మహల్ వద్ద నివాసం ఉంటున్న ఐదుగురు మహిళలు సంజయ్‌గాంధీ కాలనీ పోలింగ్ బూత్‌కు వచ్చారు. మీడియా ప్రశ్నించగా తాము తొమ్మిదో తరగతి చదువుకున్నామని, వార్డుకు మీరు సెలక్ట్ అయ్యారని చెప్పి పంపారని తెలిపి ఓటు వేయకుండా పరారయ్యారు. డిగ్రీ చదవని ఆటోడ్రైవర్లు సైతం క్యూలైన్‌లో కనిపించారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

- ప్రకాశం జిల్లా కనిగిరి 29వ గ్రాడ్యుయేట్‌పోలింగ్ బూత్‌లో మొదటి ఓటు వేసి ఓటు హక్కు వినియోగించుకున్న పిడిఎఫ్ గ్రాడ్యుయేట్ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి.
- తిరుపతి కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, ఆమె భర్త టిటిపిఎం స్కూల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.
- తిరుపతి ఎంపి డాక్టర్ గురుమూర్తి దంపతులు కలిసి ఓటేశారు.
- ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి తిమ్మినాయుడుపాళెం వద్ద ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి 226ఎ, ఎస్‌జిఎస్ బూత్‌లో ఓటు వేశారు.
- చిత్తూరులో ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్ హరినారాయణ, జేసీ వెంకటేశ్వర్లు, డిఆర్ఓ రాజశేఖర్.
- పుంగనూరు నియోజకవర్గం సదుం జడ్‌పి హైస్కూల్లో ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి.

ఓటు హక్కును వినియోగించుకున్న మంత్రి పెద్దిరెడ్డి

చంటిబిడ్డతో ఓటు వేసిన బాలింత

బ్యాలెట్ బ్యాకులు తరలిస్తున్న అధికారులు

మహిళా పోలీసుకు పరాభవం

తిరుపతి (మంగళం) : శ్రీ గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాలలో దొంగ ఓటర్లు పెద్ద సంఖ్యలో వచ్చి క్యూలైన్లలో నిలబడడంతో కొంతమంది మీడియాకు దొరికి వెళ్లిపోయారు. ఎంఆర్‌పల్లి పోలీసు స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్ రెడ్డెమ్మ ఎన్నికల విధుల నిమిత్తం డ్యూటీ చేస్తూ దొంగ ఓటర్లు ఎవరైనా ఉంటే వెళ్లిపోవాలని, దొరికితే జైలు శిక్ష పడుతుందని, దయచేసి వెళ్లిపోవాలని ప్రాధేయపడింది. అక్కడే ఉన్న వైసిపి కార్యకర్తలు కానిస్టేబుల్ ఓవరాక్షన్ చేస్తున్నారని, డిగ్రీ ఉంటేనే కదా ఓటు హక్కు ఇచ్చింది నోరు మూసుకుని ఉండాలని విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ దృష్టికి వైసిపి శ్రేణులు తీసుకెళ్లారు. దీంతో వైసిపి నేతల మాట విన్న ఎస్ఐ స్లిప్ ఉంటే లోనికి పంపించాలని, ఎవరినీ ప్రశ్నించొద్దు' అంటూ మహిళా కానిస్టేబుల్‌ను దబాయించి విధులు కొనసాగించకుండా స్టేషన్‌కు తిరిగి పంపించడం శోచనీయం.

తిరుపతిలో రీపోలింగ్ జరపాలి

అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్షాల వినూత్న నిరసన

తిరుపతిలో రీపోలింగ్ నిర్వహించాలంటూ సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఐదు గంటలకు అంబేద్కర్ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. సోమవారం జరిగిన ఎంఎల్‌సి ఎన్నిక అప్రజాస్వామికంగా జరిగిందని మండిపడ్డారు. 'ఖబడ్దార్ వైసిపి గూండాల్లారా', సిగ్గు సిగ్గు ఆరో తరగతి చదివిన వారితో ఓటు వేయించుకోవడం.. అంటూ నినదించారు. ఈ సందర్భంగా సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు వి.నాగరాజు, పి.మురళి మాట్లాడుతూ తిరుపతిలో దొంగ ఓట్లు వేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారన్నారు. అధికార పార్టీ నాయకులు అప్రజాస్వామికంగా వ్యవహరించారని, దౌర్జన్యం పరాకాష్టకు చేరిందని తెలిపారు. తిరుపతి నగరంలో రీ పోలింగ్ నిర్వహించాలని డిమాండ్‌చేశారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి, సిపిఐ రాష్ట్ర నాయకులు ఎ.రామానాయుడు మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్‌కు తాము ముందే తెలియజేశామని, స్థానిక పోలీసులను తిరుపతిలో డ్యూటీ వేయవద్దని చెప్పినా పట్టించుకోలేదన్నారు. అధికార పార్టీకి కొమ్ముగాసేలా పోలీసుల తీరు ఉందన్నారు. చంద్రగిరి ఎంఎల్ఎ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తిరుపతి ఎంపి గురుమూర్తి, ఎంఎల్‌సి అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డిలు బూత్‌ల లోపలికి దొంగ ఓటర్లను తీసుకెళ్లి రిగ్గింగ్‌కు పాల్పడ్డారన్నారు. ఎన్నికల కమిషనర్ వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. ఎన్నికల కమిషనర్ జోక్యం చేసుకుని తిరుపతిలో రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డిని కలిసి సోమవారం జరిగిన ఎన్నికల ఘటనలను వివరిస్తూ రీ పోలింగ్ జరపాలని వినతిపత్రం సమర్పించారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో పట్టభద్రులు ఓటు వేయాల్సింది పోయి చదువులేని వారిని, డిగ్రీ పూర్తి చేయనివారిని ఓటర్లుగా తీసుకొచ్చి వైసిపి దొంగ ఓట్లు వేయించిందని విమర్శించారు. పోలీసులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు దారితీస్తోందన్నారు. ఈ ధర్నాలో సిపిఎం నాయకులు టి.సుబ్రమణ్యం, జయచంద్ర, ఆర్.లక్ష్మి, సాయిలక్ష్మి, జిబిఎస్ మణ్యం, నరేంద్ర, సిపిఐ నాయకులు చిన్నం పెంచలయ్య, విశ్వనాథ్ పాల్గొన్నారు.

తిరుపతిలో అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలుపుతున్న పీడీఎఫ్, ప్రజాసంఘాల నాయకులు

తిరుపతిలో నిరసన తెలుపుతున్న పిడిఎఫ్ ప్రజాసంఘాల నాయకులు

పెళ్లిబట్టలతో నేరుగా...

రొంపిచెర్ల : పెళ్లిపీటల మీద నుంచి నవవరుడు నేరుగా వచ్చి పట్టభద్రుల ఓటు హక్కు వినియోగించుకోవడం పోలింగ్‌బూత్ వద్ద చర్చగా మారింది. రొంపిచెర్ల మండలం చెంచమరెడ్డిగారిపల్లికి చెందిన లవకుమార్‌కు సోమవారం ఉదయం 9 గంటలకు టిటిడి కళ్యాణ మండపంలో వివాహం జరిగింది. అయితే కాణిపాకం ఆలయంలో 12 గంటలకు వధూవరులు ఇరువురూ కలిసి పూజ చేసుకునేందుకు నమోదు చేసుకున్నారు. సమయం తక్కువగా ఉండడంతో వివాహం అయిన వెంటనే టిటిడి కళ్యాణ మండపం నుంచి నేరుగా పోలింగ్ కేంద్రానికి వచ్చి తన ఓటు హక్కును వినియోగించుకున్నాడు. అతను తిరుపతిలోని రిలయన్స్ స్టోర్‌లో పనిచేస్తున్నాడు. పెళ్లిబట్టలతో ఉన్న వరుడుని చూసి ఓటర్లు అందరూ ఆశ్చర్యచకితులయ్యారు.



శ్రీకాళహస్తిలో లాఠీఛార్జి

శ్రీకాళహస్తి : చెదురుమదురు ఘటనలు మినహా శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్ లో సోమవారం జరిగిన తూర్పు రాయలసీమ పట్టబధ్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. శ్రీకాళహస్తి మున్సిపాలిటీ పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ మరో అర్ధ గంటలో ముగుస్తుందన్న తరుణంలో పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద పెద్ద ఎత్తున అలజడి తలెత్తింది. అధికార వైసీపీ నాయకులు దొంగ ఓట్లు వేయిస్తున్నారంటూ, కొందరిని తాము గుర్తించి పట్టుకున్నామంటూ ప్రతిపక్ష టీడీపీ, సీపీఎం నాయకులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి బొజ్జల సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధు రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో అక్కడే ఉన్న వైసిపి కార్యకర్తలు టీడీపీ కార్యకర్తలతో గొడవకు దిగారు. ఈ క్రమంలో కొందరు వైసీపీ కార్యకర్తలు ఓ టీడీపీ నాయకుడికి చెందిన కారు అద్దాలను ధ్వంసం చేశారు. దీంతో పరిస్థితులు మరింత ఉద్రిక్తతకు ఎక్కడ దారి తీస్తాయోనని పోలీసులు లాఠి చార్జ్ చేశారు. దొంగ ఓట్లు వేసేందుకు ప్రేరేపిస్తున్న వైసిపి నాయకుల పై లాఠీచార్జ్ చేయకుండా తమపై పోలీసు ప్రతాపం చూపడం ఏం న్యాయమంటూ టిడిపి కార్యకర్తలు మండిపడ్డారు. దొంగ ఓట్లు వేసేందుకు ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అంగేరి పుల్లయ్య డిమాండ్ చేశారు. ఈ రెవెన్యూ డివిజన్ పరిధిలో మొత్తం 15,043 మంది పట్టభద్రులు ఉండగా 11683 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టభద్రుల శాతం 77.60గా నమోదయింది. ఉపాధ్యాయుల ఓట్లు 811 ఉండగా 768 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 94.70 శాతంగా నమోదైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. కొన్నిచోట్ల పట్టభద్రుల పోలింగ్ బూత్ లలో కొందరు దొంగ ఓట్లు వేసేందుకు ప్రయత్నించగా పోలీసులు గుర్తుపట్టి వెనక్కి పంపేశారు.

దొంగ ఓటరును చితకబాదిన వైసిపి

నాయుడుపేట : పట్టభద్రుల ఓట్లు 72శాతం, టీచర్ ఓట్లు 90శాతం పోలైనట్లు అధికారులు వెల్లడించారు. పోలింగ్ ప్రశాంతంగా జరుగుతున్న సమయంలో దొంగ ఓటు వేసి బయటకు వస్తున్న ఓ వ్యక్తిని టిడిపి కార్యకర్తలు ప్రశ్నిస్తుండగా పక్కనున్న వైసిపి నాయకులు కలగజేసుకోవడంతో వాగ్వివాదం నెలకొంది. దీంతో కోపోద్రిక్తులైన వైసిపి నాయకులు దొంగ ఓటు వేసిన వ్యక్తిని టిడిపి కార్యకర్తలు, అధికారుల ముందే విచక్షణారాహిత్యంగా కొడుతూ ఉద్రిక్త వాతావరణం సృష్టించారు. దీంతో ఓటర్లు భయభ్రాంతులకు గురయ్యారు. పోలీసులు అధికార పార్టీ నాయకులను కట్టడి చేయకుండా దొంగ ఓటుకు పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. టిడిపి కార్యకర్తలను ఒక ఇంట్లో ఉంచి గేట్లు మూసి రక్షణ కల్పించాల్సి వచ్చింది. పోలింగ్ అనంతరం దొంగ ఓటరునూ వదిలేయడం గమనార్హం.

నారాయణకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కోట: కోట మండలం గూడలి పంచాయతీ ప్రకాశం కాలనీలో నివాసముంటున్న కటికాల నారాయణ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఉంటున్నాడు. దీంతో శ్రీ షిరిడి అక్షయ సేవా సమితి నిర్వాహకులు అల్లం.రమణయ్య, వెంపులూరు బాబురావు చేతుల మీదుగా సోమవారం నెల్లూరుకు చెందిన ఓరుగంటి ఫనేంద్ర కుమార్ సహకారంతో రమణయ్యకు అందించారు. దాతలకు రమణయ్య కృతజ్ఞతలు తెలిపారు.

నేడు చలో మచిలీపట్నం

ప్రజాశక్తి-గూడూరు రూరల్: గూడూరు జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం చలో మచిలీపట్నం పోస్టర్లను ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. జనసేన పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖరరావు మాట్లాడుతూ జనసేన పార్టీ 10వ ఆవిర్భావదినోత్సవ వేడుకలలో భాగంగా మచిలీపట్నంలో నిర్వహిస్తున్న దిగ్విజయ సభను గూడూరు నియోజకవర్గం నుంచి వందలాది మంది కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ముందుగా గూడూరు పార్టీ కార్యాలయంలో జనసేన జెండాను ఎగురవేసి, బహిరంగసభకు బయలుదేరుతారని..ఉదయం 6.30 గంటలకు గూడూరు పార్టీ ఆఫీస్ వద్ద హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ గూడూరు పట్టణ అధ్యక్షులు ఇంద్రవర్ధన్, ఉపాధ్యక్షులు ఇమ్రాన్, ప్రధాన కార్యదర్శులు నాగార్జున, రాజా, అవినాష్, శంకర్, ధన, శివ వసంత, పట్టణ నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థుల విజయమే లక్ష్యం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రజాసంఘాల నాయకులు పనిచేశారు. సీఐటీయూ జిల్లా నాయకులు వెంకటేష్, సీపీఐ పట్టణ అధ్యక్షులు మహేష్, ఉపాధ్యాయుల సంఘం యూటీఎఫ్ నాయకులు ఎస్ఎస్ నాయుడు, దాసరి మునెయ్య, ఎస్టీయూ నాయకులు పవన్‌కుమార్, శ్రీనివాసరాజు, ఏపీటీఎఫ్ నాయకులు నరేంద్రకుమార్‌ల ఆధ్వర్యంలో పీడీఎఫ్ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేశారు. వికలాంగులకు సహకారం అందిస్తూ ఓటర్లను కేంద్రం వద్దకు తీసుకెళ్లి ఓటు వేయించారు. అలాగే చంటిపిల్లలతో వచ్చిన మహిళలకు కావాల్సిన సహాయ సహకారాలు అందించారు. ఓటర్లందరికీ ధన్యవాదాలు తెలిపారు.

ద్విచక్ర వాహనాల వరుస చోరీలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలో వరుసగా ద్విచక్ర వాహనాలు చోరీకి గురవుతుండటంతో పుత్తూరు ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పుత్తూరు రైల్వే స్టేషన్ లో గత ఆరు నెలలుగా వరుస దొంగతనాలు జరుగుతున్నా.. రైల్వే స్టేషన్ అధికారులు గాని, పుత్తూరు పోలీసులు గాని పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. గత గురువారం పుత్తూరు పట్టణానికి చెందిన భీమయ్య అనే వ్యక్తి తమ కుమార్తెను రైలు ఎక్కించేందుకు ద్విచక్ర వాహనాన్ని రైల్వే స్టేషన్ ముందు పార్క్ చేసి 20 నిమిషాల తర్వాత వచ్చి చూడగా తన ద్విచక్ర వాహనం లేదు. పుత్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రైల్వేస్టేషన్లో ద్విచక్ర వాహనాలకు పార్కింగ్ లేదు. ప్రజలు నిత్యం తిరుపతి–చెన్నై ప్రాంతాలకు ఉద్యోగ, వ్యాపార రీత్యా, వెళుతున్నారు. ద్వి చక్రవాహనాలను రైల్వే స్టేషన్ ముఖద్వారం వద్ద పెడుతున్నారు. సాయంత్రం తిరిగి వచ్చేసరికి ద్విచక్రవాహనాలు కనపడలేదని లబోదిబోమంటున్నారు. పుత్తూరు రైల్వే స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాలు పనిచేయడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

క్రాంప్టన్ షోరూం ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: తిరుపతిలో నూతనంగా ఏర్పాటుచేసిన క్రాంప్టన్ షోరూంను ఆ కంపెనీ సేల్స్ జనరల్ మేనేజర్ సంతోష్ కుమార్, ఆర్ ఎం ఉదయ్ గోకర ప్రారంభించారు. స్థానిక లీలామహల్ సర్కిల్ వద్ద తిరుమల బైపాస్ రోడ్డు పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన ఆ షోరూం వద్ద వారు మాట్లాడుతూ క్రాంప్టన్ కంపెనీకి చెందిన అత్యధిక సాంకేతికతో తయారుచేసిన వంట గది వస్తువులు, గ్యాస్ స్టవ్‌ల ఇతరత్రా వస్తువులు ఇక్కడ లభ్యం అవుతాయన్నారు. వీటిని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు స్టోర్ మేనేజర్ కిరణ్ కుమార్ ఫోన్‌నంబరు 9392447246 నంబరును సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో యజమాని సి.ఎస్. హేమాద్రి, ఎస్ఎం కర్ణ, ఉదయ్ కుగాజి, మంతోష్ కుమార్, ఉదయ రాజా, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

తేనెమంచు పురుగు నివారించాలి

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: ప్రస్తుతం మామిడి నిండు పూత పిందెకట్టే దశలో ఉందని.. ఈ దశలో తేనె మంచుపురుగు, తామరపురుగులు ఆశించి తీవ్రంగా నష్టపరుస్తాయని మండల ఉద్యానశాఖాదికారి శివకుమారి రైతులకు సూచించారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుతం మామిడి తోటల్లో తేనెమంచు పురుగు అధికంగా ఉందని.. తల్లి పురుగులు, పిల్ల పురుగులు గుంపులుగా చేరి లేత పిందెల నుంచి రసాన్ని పీలుస్తాయని.. లేత ఆకులను ఆశించినప్పుడు ఆకుల చివర్ల అంచులు మాడిపోతాయని తెలిపారు. ఈ పురుగులు విసర్జించిన తేనెలాంటి పదార్థం ఆకులపై, పూత, కాయలపై పడి నల్లని మసి ఏర్పడుతుందన్నారు. పూత, పిందె సమయంలో ఈ పురుగుల ఉధృతి అధికంగా ఉంటుందని తెలపారు. మిగిలిన సమయాల్లో ఇవి తక్కువగా చెట్ల మొదలు, కొమ్మల బెరడులోని చీలికలలో, లేదా ఆకులపై ఉంటాయని తెలిపారు. పిల్ల పురుగుల దశ రెండు నుంచి నాలుగు వారాలుంటుందని.. దీని నివారణకు ఇమిడా క్లోప్రిడ్ నాలుగు మి.లీలు లేదా థయోమిథాక్సిమ్ మూడు గ్రాముల పొడి మందు లేదా బుప్రోఫెజిన్ ఒక మి.లీ లేదా క్లో థయోనిడిన్ పదిహేను గ్రాముల పొడిమందు లీటర్ నీటికి కలిపి చెట్టు మొత్తం తడిచేలా పిచికారీ చేయాలన్నారు. రెండో తామర పురుగులు ఇవి పిందె ఏర్పడే దశలో తోలుపై గోకి రసాన్ని పిలుస్తాయన్నారు. ఇవి ఆశించిన కాయలపై రాతి మంగు ఏర్పడి కాయల నాణ్యత దెబ్బతింటుందని.. దీని నివారణకు అసిఫేట్ డబ్ల్యూపీ పొడి మందు ఒక గ్రాము లీటరు నీటికి కలిపిన మందు ద్రావణాన్ని పిచికారీ చేయాలని తెలిపారు. సందేహాలకు హార్టికల్చర్ అధికారులను సంప్రదించాలని తెలిపారు.

మండలి ఎన్నికలు ప్రశాంతం

- చంటి బిడ్డలతో మహిళా ఓటర్లు
- వసతులు కల్పించడంలో అధికారుల నిర్లక్ష్యం
- పలు ప్రాంతాల్లో వెనుదిరిగిన ఓటర్లు

బాలాయపల్లిలో చంటిబిడ్డలతో ఓటర్ల అవస్థలు



పిచ్చాటూరులో.. ఉపాధ్యాయులు, సీఆర్పీలు

బుచ్చినాయుడుకండ్రిగలో ఎమ్మెల్యే ఆదిమూలం

ప్రజాశక్తి- బాలాయపల్లి: బాలాయపల్లిలోని 24 పంచాయతీలకు గాను 1174 ఓటర్లకు గాను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు, గ్రాడ్యుయేట్‌లకు ఓ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అధికారులు ఉన్నప్పటికీ ఓటర్లకు ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదు. గంటల తరబడి లైన్‌లో నిలబడలేక ఓటర్లు అవస్థలు పడ్డారు. కొంతమంది వెనక్కి వెళ్లిపోయారు. చంటిబిడ్డల తల్లుల అవస్థల గురించి చెప్పనక్కరలేదు. పట్టభద్రులు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు ఇబ్బందులకు గురయ్యారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలో ఆదివారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతమని నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు ఎస్సై మంజునాథరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదివారం పోలింగ్ కేంద్రం వద్ద పోలీస్ సిబ్బందితో ఏర్పాట్లను పర్యవేక్షించారు. బారికేడ్లు, విద్యుత్ సౌకర్యం, తాగునీటి వసతి వంటి ఏర్పాట్లపై ఎస్సై, మండల డిప్యూటీ తహశీల్దారు శివయ్య, ఎంపీడీవో త్రివిక్రమరావు, ఆర్ఐ వెంకటసుబ్బయ్యతో కలిసి పరిశీలించారు. డీఎస్పీ నాగ సుబ్బయ్య, సీఐ విక్రమ్, ఎస్సై మంజునాథరెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

పిచ్చాటూరు: పిచ్చాటూరులో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని అధికారులు తెలిపారు. ఓటు వేసే పట్టభద్రులకు, ఉపాధ్యాయులకు అన్ని సౌకర్యాలు కల్పించామని.. ఎలాంటి సమస్య లేకుండా ఎలక్షన్ ముగియడం చాలా సంతోషకరంగా ఉందని తహశీల్దారు తెలిపారు. ఉపాధ్యాయుల ఓట్లు 18 కి 18 ఓట్లు పోలయ్యాయని..పట్టభద్రులు 703 మందికిగాను 579 మంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.

వరదయ్యపాలెం: ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎన్నికలు సోమవారం ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభించిన అధికారులు కొంత సమన్వయ లోపంతో ఓటర్లను నిరీక్షణకు గురి చేశారు. ఒకింత నిరాశకు గురైన ఓటర్లు వెనుదిరిగి వెళ్లిపోయారు. తహశీల్దారు గౌరీశంకర్ చొరవతో అధికారులను సమకూర్చడంతో ఓటర్లకు కొంత సులువైంది. ఎన్నికలను అడిషనల్ ఎస్సీ విమల కుమారి పర్యవేక్షించారు. అనంతరం వైసీపీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఎన్నికలు జరుగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలంలో సుమారు 1150 గ్రాడ్యుయేట్ ఓటర్లకు గాను 936 తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 40 మంది ఉపాధ్యాయ ఓటర్లకు గాను 36 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు అధికారులు తెలిపారు. ఎంపీడీవో సుబ్రహ్మణ్యంరాజు, డీఎస్పీ జగదీష్ నాయక్, సీఐ శ్రీనివాసులు, నాగార్జున రెడ్డి, అరుణ్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యర్రావారిపాలెం: మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ఆదివారం పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంతంగా జరిగాయి. పట్టభద్రులు 722 ఓట్లకు గాను 521 ఓట్లు పోలయ్యాయి. 15 మంది ఉపాధ్యాయులకు గాను 15 ఓట్లు నమోదు కాగా వంద శాతం ఓట్లు పోలయ్యాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. సహకరించిన ప్రజలకు సీఐ తులసీరామ్, ఎస్సై వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు.

సత్యవేడు: సత్యవేడు పట్టణంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్లో సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు పటిష్టమైన బందోబస్తు మధ్య ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం నాలుగు గంటల వరకు కొనసాగింది. ఈ నేపథ్యంలో పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి 82.013 శాతం పోలింగ్ నమోదు కాగా.. ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 93 శాతం పోలింగ్ నమోదైనట్లు తహశీల్దారు సుబ్రహ్మణ్యం తెలిపారు. శ్రీ సిటీ డీఎస్పీ జగదీష్ నాయక్ పర్యవేక్షణలో సత్యవేడు, శ్రీసిటీ ఎస్ఐలు పురుషోత్తం రెడ్డి, ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో 16 మంది పోలీస్ సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.

కోట: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో 254 మంది ఉపాధ్యాయులు ఉండగా 222 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే 2,758 మంది పట్టభద్రులు ఉండగా.. 2021 మంది 73.2 శాతం ఉపయోగించుకున్నారు.

చిల్లకూరు: చిల్లకూరులో సోమవారం ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, సీఐ దశరథ రామారావు ఆధ్వర్యంలో ఎటువంటి సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిర్వహించారు. అధికారులు పర్యవేక్షించారు.

తడ: తడ మండలంలోని తహశీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికల్లో పట్టభద్రులు 1040 మందికి గాను 835 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తహశీల్దార్ రామయ్య తెలిపారు. అలాగే టీచర్లు 19 మందికి గాను 18 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తడ ఎస్సై శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.

వాకాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకు నిర్వహించిన శాసనమండలి ఎన్నికల పోలింగ్ పోలీసుల పర్యవేక్షణలో ప్రశాంతంగా ముగిసింది. పట్టభద్రుల ఓటర్లు 1381లకు గాను 1052 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు ఉపాధ్యాయ పట్టభద్రులు మొత్తం 10 మందికి గాను పది మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు అధికారులు తెలిపారు.

చిన్నగొట్టిగల్లు: ఎమ్మెల్సీ ఎన్నికలు పోలీసు బందోబస్తుతో ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 1061 ఓట్లకు గాను.. 805 ఓట్లు నమోదయ్యాయని.. 75 శాతం పోలయ్యాయని అధికారులు తెలిపారు. ఉపాధ్యాయుల ఓట్లు 69 ఉండగా 62 ఓట్లు నమోదయ్యాయి. 92 శాతం ఓట్లు పోలయ్యాయి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ తులసీరాం, ఎస్సై ప్రకాష్‌కుమార్ ఊపిరి పీల్చుకున్నారు.

పుత్తూరు టౌన్: పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. పట్టభద్రులు 2,829 ఓట్లకు గాను 2,337 ఓట్లు పోలయ్యాయి.

బాలాయపల్లిలో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎంపీ గురుమూర్తి

బాలాయపల్లి: మండలంలో 24 పంచాయతీలలో 1174 ఓట్లు ఉండగా 672 ఓట్లు పోలయ్యాయి. ఉపాధ్యాయులు 26 ఓట్లు ఉండగా 26 పోలయ్యాయి. 57.24 శాతం ఓట్లు నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. బాలాయపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సందర్శించారు. ఆయన వెంట ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి ఉన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎటువంటి అవాంతరాలు జరగకుండా ప్రత్యేకమైన నిఘా ఉండాలని గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి సూచించారు. తహశీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో స్వరూప రాణి, ఎస్సై వీరనారాయణ, డిప్యూటీ తహశీల్దారు అజ్మీతుల్లఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి: వెంకటగిరిలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పట్టభద్రుల ఎన్నికల్లో 65 శాతం, ఉపాధ్యాయ ఎన్నికల్లో 93 శాతం ఓటింగ్ పోలైనట్లు అధికారులు తెలిపారు. పట్టభద్రుల ఓట్లు 3,821 మందికిగాను 2,484 ఓట్లు పోలయ్యాయి. ఉపాధ్యాయుల ఓట్లు 275 ఉండగా.. 256 ఓట్లు పోలైనట్లు పేర్కొన్నారు.

దొరవారిసత్రం: దొరవారిసత్రంలో సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండల కేంద్రంలోని తహశీల్దారు కార్యాలయంలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేసి ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించారు. మొత్తం ఓట్లు 832 ఉండగా 595 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయులు 25 మందికి 24 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

గూడూరు: గూడూరులో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కేంద్రాలను అడిషనల్ ఎస్పీ రాజేంద్రనాథ్‌రెడ్డి, డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి పరిశీలించారు.

వరదయ్యపాలెంలో అదనపు ఎస్పీ విమలకుమారి

సత్యవేడులో పరిశీలిస్తున్న తహశీల్దారు

తడ మండలంలో క్యూలో ఓటర్లు

పుత్తూరు డిగ్రీ కళాశాల కేంద్రంలో....

గూడూరులో పర్యవేస్తున్న పోలీసు అధికారులు

దొరవారిసత్రంలో ఓటర్లు

బాలాయపల్లిలో పరిశీలిస్తున్న డీఎస్పీ

డేటా సైన్సుతో విద్యార్థులకు భవిష్యత్

ప్రజాశక్తి - క్యాంపస్ : డేటా సైన్స్ వలన సైన్స్ రంగంలో అనేక రకాల ఉపయోగాలు ఉన్నాయని తిరుపతి ఐఐటి డైరెక్టర్ ఆచార్య కేవన్ సత్యనారాయణ పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని సాంఖ్యక శాస్త్ర విభాగం, ప్రాబబిలిటీ స్టాటిస్టిక్స్ ఇండియన్ సొసైటీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సావేరి అతిథి గృహంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ స్టాటిస్టిక్స్ అసోసియేషన్ మొదటి వార్షిక సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ నిర్వహణలో గణాంకాలను అన్వయించడం, డేటా సైన్స్‌ని ఉపయోగించి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను కూడా ఉద్దేశించి ప్రసంగించారు. కెనడాలోని ఎమెరిటస్ ప్రొఫెసర్ మెక్‌గిల్ విశ్వవిద్యాలయంలోని ప్రధాన వక్త ప్రొ.ఎ.ఎం.మథాయ్ ఐఎస్ పిఎస్ డేటా సైన్స్ సెంటర్‌కు శంకుస్థాపన చేసి, తన అందమైన జీవిత అనుభవాలను పంచుకోవడంతో మానవజాతి అభివృద్ధికి వ్యవస్థీకృత జీవన విధానం గురించి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆ తర్వాత శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్ రజిని, ప్రస్తుత పరిస్థితుల్లో డేటా సైన్స్‌ను ఉపయోగించుకునే సందేశాన్ని అందించారు. ఆంధ్రప్రదేశ్ స్టాటిస్టిక్స్ అసోసియేషన్ మొదటి వార్షిక సమావేశాన్ని ప్రారంభించారు.

ప్రొఫెసర్ వి.తంగరాజ్, మాజీ డైరెక్టర్, రామానుజన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ అడ్వాన్స్‌డ్ స్టడీ ఇన్ మ్యాథమెటిక్స్, చెన్నై, ప్రొఫెసర్ జి.శంకరనారాయణన్ జయంతి శతాబ్ది ఉత్సవాలను ప్రారంభించి, ప్రొఫెసర్ జి.శంకరనారాయణన్ జీవిత చరిత్రను వివరించారు. డాలర్స్ గ్రూప్ చైర్మన్, తిరుపతి డా.సి.దివాకర్ రెడ్డి సామాజిక బాధ్యత గురించి విద్యార్థులకు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య జి.శంకరనారాయణన్, ప్రొఫెసర్ పి. కష్ణమూర్తి, ఆచార్య వి తంగరాజ్, ఆచార్య పి.ఆర్.విట్టల్, ఆచార్య వి.కోదండరామిరెడ్డి, మాజీ రిజిస్ట్రార్, ద్రావిడ విశ్వవిద్యాలయం, ఒఆర్ సొసైటీ ఆఫ్ ఇండియా మాజీ అధ్యక్షుడు ప్రొఫెసర్ పి. రాజశేఖర రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ, స్టాటిస్టిక్స్ విభాగం హెడ్ ఇంచార్జి డా.ఎం.శివపార్వతి , పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమిష్టి కృషితోనే టీటీడీ విద్యాసంస్థలకు గుర్తింపు

- జేఈవో సదా భార్గవి
- 245 మంది విద్యార్థులకు అఛీవర్ అవార్డుల ప్రదానం
- ఇతర విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేందుకే సక్సెస్ మీట్

ప్రజాశక్తి-క్యాంపస్: విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు, ఇతర విభాగాల అధికారుల సమిష్టి కృషితోనే టీటీడీ విద్యాసంస్థలకు జాతీయస్థాయి గుర్తింపు లభించిందని జేఈవో సదా భార్గవి తెలిపారు. తిరుపతి మహతి ఆడిటోరియంలో సోమవారం సాయంత్రం స్టూడెంట్స్ సక్సెస్ మీట్ – అఛీవర్ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. అకడమిక్స్, ఎన్.సి.సి, ఎన్ఎస్ఎస్, స్పోర్ట్స్ అండ్ గేమ్స్, కల్చరల్, కో కరికులర్, కాంపిటీటివ్ ఎగ్జామ్స్, ప్లేస్మెంట్స్ తదితర అంశాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 245 మంది విద్యార్థులకు 10 గ్రాముల వెండి డాలర్, ప్రశంసాపత్రం అందజేశారు. జేఈవో సదా భార్గవి మాట్లాడుతూ ఇటీవల టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల, ఎస్వీ ఆర్ట్స్ కళాశాలకు ఏ ప్లస్ గ్రేడ్, ఎస్జీఎస్ ఆర్ట్స్ కళాశాలకు ఏ గ్రేడ్, శ్రీ పద్మావతి మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు ఎన్.బి.ఏ గుర్తింపు లభించాయని చెప్పారు. టీటీడీ సామాజిక బాధ్యతగా 33 విద్యాసంస్థల్లో 20 వేల మందికి పైగా విద్యార్థులకు విద్యాదానం చేస్తోందని తెలిపారు. వీటిలో డిగ్రీ, పీజీ కళాశాలలు, జూనియర్ కళాశాల, పాఠశాలలు, సంగీత, నృత్య కళాశాల, శిల్పకళాశాల, అనాథ విద్యార్థుల కోసం బాలమందిరం నడుస్తున్నాయని తెలిపారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఆచార్యులు కుప్పా విశ్వనాథశర్మ మాట్లాడుతూ నిజాయితీతో కష్టపడితే విజయం సిద్ధిస్తుందన్నారు .గురువుల ద్వారా నేర్చుకునే విద్య మనిషిని గొప్పవాడిని చేస్తుందన్నారు. సత్యానికి కట్టుబడి కష్టపడి పని చేసే వ్యక్తికి సృష్టి మొత్తం సహకరిస్తుందని తెలియజేశారు. పెద్దవాళ్లపై గౌరవం, భగవంతునిపై భక్తితో విద్యార్థులు కష్టపడి చదివి అనుకున్న స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. టీటీడీ చీఫ్ ఆడిట్ ఆఫీసర్ శేషశైలేంద్ర మాట్లాడుతూ శ్రీకృష్ణార్జునుల్లాగా గురు శిష్యుల సంబంధం ఉండాలన్నారు. అస్త్రాలను పక్కన పెట్టిన అర్జునుడికి శ్రీకృష్ణుడు కర్తవ్యాన్ని బోధించి యుద్ధానికి సిద్ధం చేసినట్టుగా, విద్యార్థులకు గురువులు కర్తవ్యబోధ చేయాలని సూచించారు. టీటీడీ విద్యాశాఖ అధికారి డా. ఎం.భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ టీటీడీ విద్యా విభాగం ఆధ్వర్యంలో మొదటిసారి ఇలాంటి కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాలతో స్ఫూర్తి పొంది చక్కగా రాణించాలని కోరారు. శ్వేత డైరెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ టీటీడీ విద్యా సంస్థలకు ప్రస్తుతం స్వర్ణయుగం నడుస్తోందన్నారు. సమర్థులైన అధికారుల పర్యవేక్షణలో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించాలని కోరారు. టీటీడీ విద్యా విభాగం సలహాదారు ఎల్ఆర్.మోహన్ కుమార్ రెడ్డి, డిప్యూటీ ఈవో గోవిందరాజన్ ప్రసంగించారు. ఏపీఆర్ఓ కుమారి పి.నీలిమ, శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు డా. కృష్ణవేణి వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. కళాశాలలు, పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రిన్సిపాళ్లు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి స్మగ్లర్ల అరెస్టు

ప్రజాశక్తి-గూడూరు: గూడూరు పట్టణంలోని దిగువ వీరారెడ్డిపల్లి ప్రాంతంలో సోమవారం ఉదయం గంజాయి రవాణా, సరఫరా చేస్తున్న ముగ్గురిని గూడూరు ఎస్ఈబీ పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. సెబ్ సీఐ విజయకుమార్ కథనం మేరకు.. వీరారెడ్డిపల్లి ప్రాంతంలో నివసిస్తున్న షేక్ అబ్దుల్ రహీం ఇంట్లో సోదాలు నిర్వహించి 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని, గంజాయిని సరఫరా చేసిన తెలంగాణ రాష్ట్రానికి చెందిన మల్లోజు స్వరూపా, తూర్పాటి రాములును అరెస్టు చేశారు. విచారణలో భాగంగా తుని, నర్సీపట్నం ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకొచ్చి అబ్దుల్ రహీంతో అమ్మకాలు జరుపుతున్నారని, నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నామని తెలిపారు. సెబ్ దాడులలో యస్సై శేషమ్మ, హెడ్ కానిస్టేబుల్ కిరణ్ సింగ్, కానిస్టేబుళ్లు రమేష్, ప్రసాద్, రాంప్రసాద్, భాషా, రవి, కృష్ణయ్య పాల్గొన్నారు.

'ఎయిర్‌టెల్ స్టోర్'ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-సత్యవేడు: సత్యవేడులో సీఐ శివకుమార్‌రెడ్డి చేతుల మీదుగా నూతనంగా ప్రారంభించిన 'ఎయిర్ టెల్ స్టోర్'ను పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు దామోదరం తెలిపారు. మెరుగైన సేవలే పరమావధిగా సేవలను అందిస్తున్నామని.. వినియోగదారులకు అందుబాటులో అన్ని సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు.

13 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): అన్నమయ్య జిల్లా బాలపల్లి రేంజి అటవీ ప్రాంతంలో 13 ఎర్రచందనం దుంగలను టాస్క్ ఫోర్సు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్సు ఎస్పీ కె.చక్రవర్తి ఆదేశాల మేరకు డీఎస్పీ మురళీధర్ అధ్వర్యంలో ఏఆర్ ఆర్ఐ కే. సురేష్ కుమార్ రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐ కె.సురేష్ బాబుకు చెందిన బందం ఆదివారం కూంబింగ్ చేపట్టాయన్నారు. తిరుమల చేరుకుని అక్కడ నుంచి అన్నదమ్ముల బండ మీదుగా అన్నమయ్య జిల్లా బాలపల్లి రేంజ్‌కు చేరుకున్నామన్నారు. సోమవారం తెల్లవారుజామున 3గంటల ప్రాంతంలో కంగుమడుగు ప్రాంతంలో కొందరు ఎర్రచందనం దుంగలు మోసుకుని వెళ తూ కనిపించగా వారిపై టార్చ్ లైట్లు వేసి లొంగిపోవాలని హెచ్చరిస్తూ వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేశామన్నారు. అయితే వారు దుంగలు పడేసి చీకట్లో పొదల మధ్య నుంచి పారిపోయారన్నారు. ఆ ప్రాంతంలో 13 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. దీనిపై తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీస్ స్టేషన్ సీఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: లారీ ఢీకొని ఓ యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. బత్తులవల్లం గ్రామానికి చెందిన కళ్యాణ్ యాదవ్ ఆదివారం రాత్రి తడ నుంచి ద్విచ్రవాహనంపై ఇంటికి వస్తుండగా ఎదురుగా తడ వైపు వెళతున్న లారీ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజంపేటలో స్మగ్లర్లపై దాడులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): అన్నమయ్య జిల్లా రాజంపేట అటవీ ప్రాంత పరిధిలో సోమవారం ఉదయం 19 ఎర్రచందనం దుంగలను టాస్క్ ఫోర్సు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్సు ఎస్పీ కే.చక్రవర్తి ఆదేశాల మేరకు డీఎస్పీ మురళీధర్ అధ్వర్యంలో ఆర్ఐ చిరంజీవులుకు చెందిన రాఘవేంద్ర బందం అన్నమయ్య జిల్లా సానిపాయ రేంజ్ పింఛా సెక్షన్ లో కూంబింగ్ నిర్వహిస్తుండగా జిల్లేళ్లమంద ఫారెస్ట్ బీట్ పరిధిలోని నల్లబండలు, పోరాకనుమల మధ్య కొంతమంది ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ కనిపించారన్నారు. టాస్క్ ఫోర్స్ సిబ్బందిని చూసి వారు దుంగలను పడేసి పారిపోయారన్నారు. ఆ ప్రాంతంలో 19 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ కు తరలించామన్నారు. ఈ ఘటనపై ఎస్ఐ మోహన్ నాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE :: PILER
O.S.No. 249 OF 2018

Saptagiri Grameena Bank, Sodum, Represented by its Regional Manager, Madanapalli. ...Plaintiff

Vs

Smt K.Sujathamma and others. ...Defendants

SUIT SUMMONS TO 1ST DEFENDANT

TO,
D1. Smt. K.Sujathamma, W/o Chandra Reddy, aged about 50 years, Hindu, House Wife, residing at D.No.18/4/108/F, Railway Colony, Tirupati Post and urban Mandal, Tiruapti District.

whereas the above-named plaintiff has filed the above suit for recovery of Loan amount due to the Plaintiff Bank against you and others and the same is stands posted for your appearance on 23-03-2023. Please take suit summons and appear before the above said Hon'ble court on 23-03-2023 at 10-30 A.M, either in person or through an Advocate and file your objections, failing which matter will be heard and decided on merits in your absence.

//By Order Of the Court//
M.R.VENKATA RAMANA REDDY, B, Sc., LL.B.,
Advocate, Piler.
Counsel for Plaintiff.